RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 82 | పేజీలు : 4 | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం'

ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

'సర్' వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

'ఓటు చోరీ' రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య

ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు

భవిష్యత్ ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నూతన ప్రాంగణం
- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- సంస్థ ఏర్పాటుకు 12 ఎకరాల భూమిని కేటాయించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి
- ఈ కేంద్రం ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్థగా నిలవాలని ఆకాంక్ష
- బోస్టన్‌కు చెందిన ప్రఖ్యాత పెర్కిన్స్ స్కూల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్న ఎల్వీ ప్రసాద్ సంస్థ
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలని పిలుపునిచ్చిన చంద్రబాబు

అమరావతి

ఏపీ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు అంకురార్పణ జరిగింది. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద నిర్మించనున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నూతన ప్రాంగణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటవుతున్న ఈ కంటి ఆసుపత్రి ప్రపంచంలోనే నంబర్ వన్ సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు. "రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. భవిష్యత్తు అంతా ఆవిష్కరణలదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. ఆ దిశగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు ఒక కీలక ముందడుగు" అని అన్నారు. ఈ సంస్థ కోసం అమరావతిలో 12 ఎకరాల భూమిని కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయేది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, ఇది 'ఫ్యూచరిస్టిక్ హెల్త్‌కేర్' కేంద్రమని వివరించారు. అధునాతన టెర్షియరీ కేర్‌తో పాటు, పుట్టుకతో వచ్చే అంధత్వాన్ని నివారించేందుకు, - మిగతా3లో

తిరుమలలో వైభవంగా చక్రస్నానం

- ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు





బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి..

- సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్
- పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మళ్లీ ఎన్నికలు జరపాలని మమత డిమాండ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని మమత వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని మమత ప్రకటన
- 30 లక్షల ఓటర్ల పేర్లు తొలగించారని అభిషేక్ ఆరోపణ

ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

- రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



హైదరాబాద్

రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా - మిగతా3లో

రేపు అహ్మదాబాద్ పర్యటనకు మంత్రి లోకేశ్

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పర్యటన

సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొననున్న మంత్రి

ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహణ



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఇందుకోసం ఆయన రేపు రాత్రికి అహ్మదాబాద్ చేరుకుంటారు. ఎల్లుండి అక్కడ జరిగే ఓ కీలక కార్యక్రమంలో పాల్గొంటారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అహ్మదాబాద్‌లో పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026ను నిర్వహిస్తోంది. ఈ సదస్సులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి (ఏపీ ఈడీబీ) ప్రత్యేకంగా ఒక రోడ్‌షోను ఏర్పాటు చేసింది. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను, పెట్టుబడులను ఆహ్వానించడమే ధ్యేయంగా జరగనున్న ఈ రోడ్‌షోలో మంత్రి లోకేశ్ పాల్గొంటారు. - మిగతా3లో

51 మంది వైసీపీ నేతలపై రౌడీ షీట్లు ఓపెన్ చేయాలంటూ ఆదేశాలు

విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణుల రచ్చ

గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై కూడా దాడి

దేవినేని అవినాశ్ సహా 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని సీపీ ఆదేశం





రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్‌కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

రెండు డీఏలకు గ్రీన్‌సిగ్నల్

- తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల - మిగతా3లో

ఎన్నికల కమిషన్‌లో విభేదాలు..? స్పందించిన బీజేపీ

- ఈసీలో విభేదాలపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన బీజేపీ
- 'ఓట్ల చోరీ' ఆరోపణల్లో వాస్తవం లేదని సంబిత్ పాత్రా వెల్లడి
- ఓట్ల తొలగింపుతో బెంగాల్‌లో తామే ఎక్కువ నష్టపోయాం
- కమిషనర్ల మధ్య చర్చలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం
- ఎన్నికల్లో గెలవలేకే సంస్థలపై కాంగ్రెస్ దాడి చేస్తోందని ఆరోపణ



బుధవారం 23 సెప్టెంబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

అస్మిత్ చొరవతో..... నెరవేరిన చిరకాల కోరిక..!!

....ఎమ్మెల్యే జేసీ చొరవ... దశాబ్దాల సమస్యకు పరిష్కారం

....రూ.1.60 కోట్లతో నిర్మించిన వంతెనలి

....ఇగుడూరు - తిమ్మేపల్లి మధ్య రాకపోకలకు మార్గం సుగమం



గోరంట్ల జనానికి.... జల్ జీవన్ "జలం" అందేనా!!





ఇంటింటికి కుళాయిలకై... 6 నెలల క్రితమే రూ, 3.15 కోట్లు కేటాయింపు.

గోరంట్లలో 3 ఓవర్ హెడ్ ట్యాంకులు, మూడున్నర కిలోమీటర్ల 8 ఇంచిల పైప్ లైన్

చౌడేశ్వరి కాలనీ, టీటీడీ కళ్యాణ్ మండపం ఏరియా, వినాయక నగర్ ప్రాంతాల్లో... 3 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు.

టెండర్లు ఐనా, నిధులు సిద్ధంగా ఉన్నా... పనులకు అడ్డంకి కారణం ఎవరు.

ట్యాంకుల నిర్మాణానికి స్థలం కేటాయించడంలో.... రెవిన్యూ నిర్లక్ష్యమేనా.

పట్టణంలో మూడు ప్రాంతాల్లో... ఇంటింటికి కుళాయిలు.

మంత్రి సవితమ్మ చొరవ తీసుకుంటే... పార్నపల్లి నీళ్లు గోరంట్లలో పరుగులు.

గోరంట్ల సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం.

గోరంట్ల పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ, 3.15 కోట్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభ కాక జల్ జీవన్ జలం జనంకు అందక ఇంకెన్నాళ్లకు తాగునీటి సమస్య తీరుతుందో అని గోరంట్ల ప్రజలు ఎదురుచూస్తున్నారు. పార్నపల్లి డ్యాం నుంచి సత్య సాయి వాటర్ ప్రాజెక్టు ద్వారా గోరంట్లకు ప్రత్యేక పైపులు ఏర్పాటు చేయడం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక ట్యాంకు ఏర్పాటు చేయడం జరిగిన విషయం తెలిసిందే. గోరంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మించిన ట్యాంకు ద్వారా గోరంట్ల జనానికి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి నిరంతరం నీళ్లు అందించే విధంగా జల్ జీవన్ పథకం ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్లు ఐ రూ, 3.15 కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే వెంకటరమణ అనే వ్యక్తి ఈ టెండర్లు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలోనే కమ్మవారిపల్లి సైతం తాగునీటికై రూ, 30 లక్షల విలువైన టెండర్లను సత్యనారాయణ వ్యక్తి దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు టెండర్లు ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.అయితే ఇప్పటికే ఆరు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాక గ్రహణం - మిగతా3లో



ఇబ్బంది లేకుండా.... ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలి..!!

బుక్కపట్నం మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సిద్ధాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో జిల్లా కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహార పంపిణీ పై జిల్లా కలెక్టర్ ఆరా.



బుక్కపట్నం,సెప్టెంబర్,23 సీమ వార్త సాయంత్రం.

బుక్కపట్నం మండలం సిద్ధాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా పర్యటించారు.గ్రామంలోని గ్రామ సచివాలయం, రైతు సేవ కేంద్రం, విలేజ్ క్లినిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.అనంతరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. తనిఖీల్లో భాగం గా కలెక్టర్ పలు ప్రభుత్వ విభాగాలు, సేవల నిర్వహణపై ఆరా తీశారు.ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, పిటిషన్ల పరిష్కారం మరియు సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా సకాలంలో సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి కొరత రాకుండా ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.గ్రామంలో లభ్యమవుతున్న వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను తనిఖీ చేశారు. గర్భిణులు, - మిగతా3లో

హాఫ్ మూన్ మోడల్ ల్లో... పంట సాగు లక్ష్యం నెరవేరాలి..!!

ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి.

.....పూర్తి స్థాయిలో పంటల సాగు చేపట్టాలి.. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్.

అనంతపురం, సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం.



అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో (ప్రైమరీ సెక్టార్) పై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న కొర్రలు, జొన్నలు, ఉలవలు, అలసందలు, పెసలు లాంటి ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకొని పూర్తి స్థాయిలో పంటల సాగు సాగు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 275.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 176.1 మిల్లీమీటర్ల నమోదై 36 శాతం తక్కువ వర్షపాతం కురిసిందని, జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు వచ్చి సెప్టెంబర్ నెలలో మాత్రం సాధారణ వర్షపాతం వచ్చిందని, జిల్లాలో 3,43,394 హెక్టార్లలో పంటలు సాగు చేపటాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,78,407 హెక్టార్లలో సాగై 81 శాతం పంటలు సాగు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకొని మిగిలిన హెక్టార్లలో కూడా పంటలు సాగులోకి తీసుకురావాలని, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే 98 శాతంపైగా పూర్తి కాగా, నెలాఖరులోగా పూర్తిగా చేపట్టాలన్నారు. జిల్లాలో 302 రైతు సేవా కేంద్రాల పరిధిలో హాఫ్ మూన్ మోడల్ లో కేటాయించిన పంటల సాగు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్.నినో పరిస్థితులు నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఏపీఎంఐపీ, ఏపీసీఎన్ఎఫ్, మార్కెటింగ్, ఫిషరీస్, మార్క్ఫెడ్, డిఆర్డిఏ, డ్వామా, తదితర శాఖల పరిధిలో ఆయా కార్యక్రమాల ప్రగతి, అభివృద్ధి గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిసిఓ అరుణకుమారి, డిఎస్ఓ శోభారాణి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శైలజ, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం డా.నవీన్, జిల్లా ఫిషరీస్ అధికారి విజయకృష్ణ, ఆత్మ పిడి, మార్కెటింగ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

బుధవారం 23
సెప్టెంబర్ 2026

హరిజన వాడ..ఏదీ అభివృద్ధి జాడ..?

ఏళ్ల తరబడి అదే కష్టం... మురుగునీటి తోనే సహవాసం..

తాడిపత్రి, సెప్టెంబర్ 23 సాయంత్రం: తాడిపత్రి పట్టణంలోని హరిజనవాడలో మురుగునీటి సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. వర్షం వస్తే చాలు వీధులన్నీ మురుగునీటితో నిండిపోతున్నాయి. సీబీ రోడ్ లోని లలిత మెగా మాల్ పక్క వీధిలో, నెంబర్ వన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వీధిలో మోకాలు లోతున నీరు నిలుస్తోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.



శాశ్వత పరిష్కారం కోసం ఎదురు చూపులు

డ్రైనేజీలు పూడికతో నిండిపోయి నీరు వెళ్లే మార్గం లేకుండా పోయిందని, మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా మిషన్లతో పనులు చేస్తున్నారు. కానీ శాశ్వత పరిష్కారం కోసం అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఎదురు చుస్తున్నారు.

39 కోట్లతో రోడ్ల అభివృద్ధి ఆధునీకరణ పనులు వర్చువల్ గా సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. వర్చువల్



శంకుస్థాపన సందర్భంగా ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి తాడిపత్రి రూపురేఖలు మారబోతున్నాయని ప్రకటించారు. మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులు మంజూరైన నేపథ్యంలో, ఈ సారైన తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య



ఓబులదేవరచెరువు (సెప్టెంబర్23)సీమవార్త సాయంత్రం: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన యువరైతు వల్లం నాగభూషణ(49) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు.ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... నాగభూషణ అనే రైతు అప్పులు చేసి ఇటీవల పంటలు సాగు చేశారు.అయితే వర్షాలు లేక పంట సాగు చేతికి రాకపోవడంతో మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగారు.ఇది గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం కదిరి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే అక్కడి వైద్యుల సూచన మేరకు... మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిసింది. సంఘటనపై కుటుంబ సభ్యులు,బంధువుల ఫిర్యాదు మేరకు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిదవ రోజుకు చేరిన వీఆర్ఏల సమ్మె



బొమ్మనహాళ్, సెప్టెంబర్ 23 (సీమవార్త) సాయంత్రం: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ బొమ్మనహాళ్ మండలానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఎనిమిదోవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీఆర్ఏలు తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమానికి వీఆర్ఏల అధ్యక్షుడు మారుతి రామకృష్ణ ఆంజనేయులు మారెన్న కీర్తి అరుణ నాగేంద్ర వన్నూరు స్వామి పోతురాజు ప్రేమ్ పాల్గొన్నారు

బీసీ సంక్షేమ సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ గా సొంపాలెం అఖిల్ భూషణ్ నియామకం....



తనకల్లు, సెప్టెంబర్ 22 సాయంత్రం సీమ వార్త న్యూస్... బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆదేశాలమేరకురాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్ సూచనల తో బీసీ సంక్షేమ సంఘం తనకల్లు మండల యూత్ ప్రెసిడెంట్ గా సొంపాలెం అఖిల్ ను నియమించారు. ఈ సందర్భంగా సొంపాలెం అఖిల్ మాట్లాడుతూ మండలం లో బడుగు ,బలహీన వర్గాల అభ్యున్నతికి, వెనుక బడిన కులాల అభివృద్ధికి నా వంతు పోరాటం చేస్తానని, నా ఈ నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోంపాలెం నాగభూషణం కి,కదిరి నియోజకవర్గ అధ్యక్షులు మిరాసి వేమనారాయణ కు మండల అధ్యక్షులు కనుకొండ నర్సింహులు గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

డీలర్ల సమావేశం నిర్వహించిన.... తహసీల్దార్ రఘు



బొమ్మనహాళ్, సెప్టెంబర్ 23 (సీమవార్త) సాయంత్రం: బొమ్మనహాళ్‌లో స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు డీలర్లు స్టాక్ గురించి కొన్ని సూచనలు ఇచ్చారు స్టాకును దింపుకొనేటప్పుడు స్కాన్ చేయాలని సూచించారు.సక్రమంగా ఉన్నాయో లేదో సరుకులను సరిచూసుకొని సరుకులను లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. స్టాక్‌లో వ్యత్యాసాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ ద్వారా కూడా తప్పనిసరిగా స్కాన్ చేయాలని తెలిపారు. ప్రతి నెల స్టాక్ పాయింట్‌లో ఎలాంటి వేరియేషన్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు. సమావేశంలో తాసిల్దార్ రఘు సి ఎస్ డి టి పవన్ స్టాక్ పాయింట్ అధికారి సుధాకర్ డీలర్ల అధ్యక్షుడు మోహన్, తిప్పేస్వామి, భాస్కర, ప్రభు, రమేష్, మొక్కన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సహాయకుల దీక్ష కు....రైతుల సంఘీభావం.



గోరంట్ల సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం.దీక్షా శిబిరాన్ని సందర్శించిన రైతులు వీఆర్ఏ లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. వీఆర్ఏ ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏ ప్రధాన డిమాండ్ల లో భాగంగా తెలంగాణ తరహాలో వేతన స్కేల్ అమలు చేయాలని అర్హులైన వీఆర్ఏ లకు జి ఓ 480 ప్రకారం వీఆర్వో లుగా పదోన్నతులు కల్పించాలని,నామినీ వీఆర్ఏ ల నియామకాలను పూర్తి చేయాలని,ప్రభుత్వం వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి వీఆర్ఏ ల డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

టీ కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన బొంబాయి రమేష్ నాయుడు



యాడికి సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంకాలం యాడికి గుత్తి రోడ్డు హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన టీ కేఫ్ (విశ్వ టీ కొట్టు) ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు మాజీ ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ మరియు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు గొడ్డు మర్రి రామమోహన్ వార్డ్ సభ్యులు గజ్జి బాల పెద్దయ్య నాయకులు చిట్టెం రెడ్డి బాల రెడ్డి పొంతల కిట్టయ్య,కడ్డీలా నాగేంద్ర మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

గోరంట్ల సిఐ బోయ శేఖర్ ను సన్మానించిన ఆర్యవైశ్యులు.

గోరంట్ల సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఐ బోయ శేఖర్ ను ఘనంగా సన్మానించారు. వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుని నిమజ్జనం కార్యక్రమాలు నేపథ్యంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు సిఐ శేఖర్ ను పూలమాలలు శాలువాలతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా, నంద గోపాల్ , సుకుమార్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ టిడిపి నాయకుడికి పరామర్శ



ఓబులదేవరచెరువు (సెప్టెంబర్24)సీమవార్త సాయంత్రం:ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన టిడిపి నాయకులు జమ్ముల వెంకట్ రెడ్డి ని వడ్డెర సేవా సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సుహాసిని భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటరెడ్డి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వడ్డెర సంఘం సేవ సంఘం అధ్యక్షులు ఇడుగుట్ట ఆంజనేయులు, కుంచపు శ్రీనివాసులు,గోవుల వెంకటనారాయణ, నాయకులు విజయకుమార్,నవాబ్ కోట నాగరాజు, వెంకటేష్,నరేష్, తిరుపాలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బలిజలపై నిర్లక్ష్యం వహిస్తే.... గుణపాఠం తప్పదు.

మున్సిపల్ ఎన్నికల్లో బలిజలకు సముచిత స్థానం కల్పించాలి.

పుట్టపర్తి బలిజ సంఘం ఆధ్వర్యంలో... సాయి ఆరామం లో ప్రత్యేక సమావేశం.

పుట్టపర్తి సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో సుమారు



5000 పైగా ఓటర్లు ఉన్న బలిజలకు జనాభా ప్రాతిపదికన మునిసిపల్ కౌన్సిలలు గాను మరియు చైర్మన్ అభ్యర్థులుగా బలిజలకు అవకాశం కల్పించాలని పుట్టపర్తి బలిజ సంఘం నాయకులు మరియు బలిజ కులస్తులు బుధవారం సాయి ఆరామం సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. గత పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో ఉన్న 20 వార్డులకు గాను ఏ పార్టీ ఒక్క కౌన్సిలర్ స్థానానికి గాని అవకాశం కల్పించకపోవడం దుర దృష్టకరం. బలిజలను అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తూ కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే బలిజలను వాడుకుని వారు అధికారాన్ని అనుభవిస్తున్నారు. కావున రాబోయే పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో బలిజలకు కుల ప్రాతిపదికన మేరకు బలిజలకు తగిన స్థానాలు కేటాయించి న్యాయం చేయాలని అన్ని పార్టీలను డిమాండ్ చేస్తున్నాము, ఈ ఎన్నికల్లో బలిజలకు అన్యాయం జరిగితే తగిన గుణపాఠం చెప్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఏ ఆర్ యస్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ.....



అమడగూరు సెప్టెంబర్ 23 సాయంత్రం సీమ వార్త న్యూస్ అమడగూరు మండల పరిధిలోని ఆదర్శ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఏ ఆర్ యస్ కదిరి వారి నిర్వహణలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ ఆర్ యస్ కదిరి నుండి శాస్త్రవేత్తలు అనిత, రమేష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం ఎంపిక, ఎరువులయా జమాన్యం, నీటియాజమాన్యం, విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యలు, అదర్ క్రాప్ ఇతర పంటలు,, రైతు ఒకే పంట వేయకుండా పంట మార్పిడి చేస్తూ ఉంటే దిగుబడి ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ఎల్లపుడు ఒకే పంట వేయకుండా మారుస్తూ ఉండాలన్నారు. పంటలకు వచ్చే తెగుళ్లు, పురుగు గురించి వివరించారు. వాటి నివారణ చర్యలు గురించి రైతులకు వివరించడం జరిగింది.తగు మొతాదుల్లో పురుగు మందులు వినియోగించాలని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ యస్ సిబ్బంది అనిత, రమేష్ నాయక్ వాసన్ సంస్థ సిబ్బంది మనీష్, లోకేశ్వరి, సురేంద్ర, సీసీలు శీనప్ప, శివశంకర్ ఆదర్శ రైతు సంఘం ,పాలక వర్గ సభ్యులు అరుణమ్మ, గాయత్రీ, శంకర్ రెడ్డి, కమ్యూనిటీ మొబలైజర్స్ అలివేలమ్మ, లక్ష్మీనారాయణ, నాగరాజు, బాబు నాయక్, రైతులు పాల్గొన్నారు.

యాడికి విలేజ్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మేకల మురళి

యాడికి సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంకాలం యాడికి మండలం పిన్నేపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేకల మురళి విలేజ్ ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ గా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాడికి సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు నాపై నమ్మకం ఉంచి నాకు ఇంతటి బాధ్యతలు అప్పగించినందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరియు నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

సీమ వార్త సాయంకాలం

బుధవారం 23
సెప్టెంబర్ 2026

కరువుతో రైతులు అల్లాడుతున్నారు ఆదుకోండి.





తాసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన... రైతు కూలీ సంఘం.

గోరంట్ల సెప్టెంబర్ 23 సీమ వార్త సాయంత్రం. జిల్లాలో కరువు కరాల నృత్యం చేస్తున్నది ఎక్కడ చూసినా బీటలు వారిన పొలాలు ఎండిపోయిన చెరువులు కుంటలు వాగులు దర్శనము ఇస్తున్నాయి అనేక గ్రామాల్లో త్రాగునీరు ప్రజలకు పశువులకు చిక్కక అల్లాడు తున్నారు రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెక్కి నట్లు ఉంది ఈ సంవత్సరం ఎల్ నీ నో ప్రభావంతో తీవ్ర వర్షాభావం పరిస్థితులు ఎదుర్కొంటున్నాం వర్షాలు కురిసే సమయములో వర్షాలు లేకపోవడం అధిక ఉష్ణోగ్రత లు భూగర్భ జలాలు అరగంటటం చెరువులు వంకలు నీరు నిలువు లేక వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది మన సత్యసాయి జిల్లా అత్యధిక ప్రాంతాల్లో కరీఫ్ సాగు దెబ్బతిని పంటలువేసిన రైతులు వర్షాలు కోసం ఆకాశం వైపు చూస్తున్నారు వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి పశువులకు మేత నీరు ప్రజలకు త్రాగునీరు కూడా చిక్కడం లేదు సత్య సాయి జిల్లాలో ప్రధాన డిమాండ్ లలో భాగంగా పశువులకు మేత సరఫరా చేయాలని, జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించాలని,రైతులు పెట్టిన పంటకు నష్టపరిహారం ఎకరాకు 50 వేలు అందించాలని, రైతులు తీసుకున్న రుణాలను రుణమాఫీ చేయాలని,తిరిగి రీ సెడ్డిల్ ద్వారా రుణాల అందించాలని, రైతు కూలీలకు గ్రామీణ ఉపాధి పథకం కింద 200 వందల రోజులు పనిని కల్పించాలని రోజు కూలి 700 రూపాయలు అందించాలని, జిల్లాలో అన్ని చెరువులకు కాలువల ద్వారా నీరు నింపాలని,జిల్లాలోఅన్ని విధాలుగా రైతులను కూలీలను కార్మికులను కర్షకులను ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం డిమాండ్ చేయడం జరిగినది. ఇందులో పాల్గొన్న సభ్యులు జిల్లా నాయకుడు సుధాకర్ సురేష్ బాబు రామ్ నాయుడు శ్రీనివాసులు బి,సిన గంగాధర్, మహిళా సంఘ జిల్లా కార్యదర్శి జయలక్ష్మి మహిళా సభ్యులు భారతమ్మ రామ్ లక్ష్మమ్మ మనీ చంద్రమ్మ నాగేశ్వరమ్మ ఓబులమ్మ శివమ్మ ఆదిలక్ష్మమ్మ అలివేలమ్మ రత్నం తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల కమిషన్‌లో విభేదాలు..?
స్పందించిన బీజేపీ

ఎన్నికల కమిషన్ (ఈసీ)లో విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై బీజేపీ స్పందించింది. కమిషనర్ల మధ్య అధికారిక చర్చలు, సంప్రదింపులు జరగడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా సవరణ విషయంలో విపక్షాలు చేస్తున్న 'ఓట్ల చోరీ' ఆరోపణలను బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తీవ్రంగా ఖండించారు.

బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపారు. "ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ బెంగాల్‌లో అత్యధికంగా ఓట్లు తొలగించిన 20 స్థానాల్లో 13 సీట్లను టీఎంసీ గెలుచుకోగా, బీజేపీ కేవలం 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. అలాంటప్పుడు మేము ఎలా లబ్ధి పొందుతాం?" అని ఆయన ప్రశ్నించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని షంషేర్ గంజ్ నియోజకవర్గంలో అత్యధికంగా 91,712 ఓట్లు తొలగించగా, అక్కడ టీఎంసీ అభ్యర్థే గెలిచారని, ఆ ఎన్నికల్లో బీజేపీ కనీస పోటీ ఇవ్వలేకపోయిందని గుర్తుచేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు అభ్యంతరం వ్యక్తం చేశారని ఓ పత్రికలో కథనం వెలువడిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. దీనిపై సంబిత్ పాత్రా స్పందిస్తూ, కమిషనర్ల మధ్య చర్చలు జరిగిన మాట వాస్తవమేనని, అయితే చర్చల అనంతరం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని ఈసీ స్వయంగా వివరణ ఇచ్చిందని తెలిపారు. ఇదే ప్రజాస్వామ్య సౌందర్యం అని ఆయన వ్యాఖ్యానించారు. 2014లో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల తిరస్కరణకు గురవుతున్న కాంగ్రెస్, ఇతర విపక్షాలు, ఎన్నికల్లో గెలవలేక ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు.

తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

భవిష్యత్ ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా యువతలో పెరిగిపోతున్న మయోపియా (దూరదృష్టి లోపం) సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఆసుపత్రి ప్రాంగణానికే పరిమితం కాకుండా ఇంటి వద్దకే వైద్య సేవలు, దీర్ఘకాలిక పునరావాస సేవలను కూడా అందిస్తామని పేర్కొన్నారు.

ఈ లక్ష్య సాధన కోసం అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న ప్రఖ్యాత 'పెర్కిన్స్ స్కూల్ ఫర్ ది బ్లైండ్'తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. విశ్వవిఖ్యాత హెలెన్ కెల్లర్, ఆమె గురువు యాన్ సుల్లివన్ విద్యాభ్యాసం చేసింది కూడా ఇదే పాఠశాలలో కావడం విశేషం. ఈ భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సేవలను అమరావతి కేంద్రంగా అందించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

రేపు అహ్మదాబాద్ పర్యటనకు మంత్రి లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి లోకేశ్, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను, మౌలిక సదుపాయాలను పారిశ్రామికవేత్తలకు వివరించనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం':

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి..

పశ్చిమ బెంగాల్‌లో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) వివాదం మరోసారి ముదురుతోంది. 'సర్' సహా ఓటర్ల తొలగింపు, చేర్పు వంటి కీలక నిర్ణయాలపై ఎన్నికల సంఘం కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారన్న వార్తలు దీనికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేయాలని కోరారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నంతకాలం దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్యాలతో చర్చించామన్నారు. త్వరలో సమావేశం అవుతామని తెలిపారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి 30 లక్షల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. హర్యానా, బీహార్‌లోనూ ఇలాంటి చర్యలు జరిగాయని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ఎన్నికల సంఘం వ్యవహారాలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండించింది. 'సర్' సహా అన్ని కీలక నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. అధికారులు చర్చల

గోరంట్ల జనానికి....
జల్ జీవన్ "జలం" అందేనా..!!

-మొదటిపేజీ తరువాయి

పట్టుకున్నట్లుగా ఆగిపోయాయి. టెండర్ల ఎస్టిమేషన్లో భాగంగా గోరంట్ల పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణ నుంచి ఒకటవ వార్డులోని ఎంఆర్సి కార్యాల ఆవరణ వరకు దాదాపు మూడున్నర కిలోమీటర్ల దూరం 8 ఇంచీల పైపులు ఏర్పాటు చేయడం, చెప్పడేశ్వరి కాలనీ, టీటీడీ కల్యాణ మండపం ఏరియా, వినాయక నగర్ ప్రాంతాల్లో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించడం ఈ మూడు ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయడం కోసమై నిధులు వెచ్చించడం జరిగింది. అయితే పట్టణంలో ఆ మూడు ప్రాంతాల్లో ట్యాంకులు నిర్మాణాన్ని కోసం స్థలం కేటాయించడంలో రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం జరుగుతుందని అందుకోసమే ఇంత ఆలస్యం జరుగుతోందని మరోవైపు కాంట్రాక్టర్ల వాదన. ఏది ఏమైనా గోరంట్ల ప్రజల దాహార్తి తీర్చేందుకు మంత్రి సవితమ్మ చొరవతో మంజూరైన నిధులు సకాలంలో ఖర్చు చేసి పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయగలిగితే గోరంట్ల ప్రజలకు శాశ్వత త్రాగునీటి సమస్య తీరుతుందని పట్టణ ప్రజలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని స్థానిక ప్రజల అభిప్రాయపడుతున్నారు.

ఇబ్బంది లేకుండా....
ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలి..!!



-మొదటిపేజీ తరువాయి

బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలు అందించాలని, ల్యాబ్ పరీక్షల సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. నాడు-నేడు పనుల పురోగతి,విద్యా కానుక మరియు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.చిన్న పిల్లల హాజరు, వారి ఆరోగ్య పరిస్థితులు మరియు పౌష్టికాహార పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. చిన్నపిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని సిబ్బందికి స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాలు మరియు సేవలు ప్రజలందరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

అస్మిత్ చొరవతో.....నెరవేరిన చిరకాల కోరిక..!!



తాడిపత్రి, సెప్టెంబర్ 23 సాయంత్రం (సీమ వార్త): ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డి చొరవతో తాడిపత్రి నియోజకవర్గంలో దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. ఇగుడూరు – తిమ్మేపల్లి గ్రామాల మధ్య బ్రాహ్మణపల్లి వద్ద రూ.1.60 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వంతెనను మంగళవారం ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డి ప్రారంభించారు. జోరు వర్షం కురుస్తున్నప్పటికీ ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరై వంతెనను ప్రారంభించడం విశేషం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, తమ ప్రభుత్వం వచ్చాక ప్రజల చిరకాల కోరికలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఈ వంతెన నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య దూరం తగ్గడంతో పాటు, రైతులు తమ పంటలను మార్కెట్ కు తరలించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లాది నిధులు మంజూరు చేయించామని, అభివృద్ధిలో తాడిపత్రిని ఆదర్శంగా నిలుపుతామని స్పష్టం చేశారు. వంతెన లేక గతంలో వాగు దాటడానికి నానా ఇబ్బందులు పడేవారమని, వర్షం వస్తే పిల్లలు స్కూళ్లకు కూడా వెళ్లలేకపోయేవారని, ఇప్పుడు ఆ కష్టాలు తీరాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వర్షంలో కూడా కార్యక్రమం నిర్వహించినా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, మండల అధికారులు, ఇగుడూరు, తిమ్మేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881